సాక్షి హైదరాబాద్

ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



... ఏడాదిలోనే చేశాం

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధిని కాంగ్రెస్ సర్కారు ఏడాదిలోనే చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. -8లో



క్రేజీ.. కేజే..

బాత్‌రూమ్ సింగర్స్‌ని బాల్‌రూమ్ సింగర్స్‌గా మారుస్తున్న క్రెడిట్ కరోకే జాకీ (కేజే)లకే దక్కుతుంది. కేజేలకు నగరం కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ ఈవెంట్లకు డిమాండ్ భారీగా పెరిగింది. -సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/22.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



నోరూరించే.. హోరెత్తించే..

ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఐమాక్స్ హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాళ్లను శనివారం సాయంత్రం శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. అలాగే.. నగరంలో ప్రసిద్ధి గాంచిన పలు బ్రాండెడ్ హోటళ్లు ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. హైదరాబాద్ బిర్యానీ, మొఘలాయి వంటకాలు, చాట్, ఐస్‌క్రీం, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరీ ఐటమ్స్ నగరవాసులను చవులూరించాయి. మ్యూజికల్ నైట్‌లో భాగంగా వందేమాతరం శ్రీనివాస్, కల్పన తదితర గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు శ్రోతలను ఉర్రూతలూగించాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. – ఖైరతాబాద్





ఇది మా అడ్డా

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గదను బహూకరించగా.. ఆయన దానిని ఇలా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను అలరించాయి.

అవగాహన.. పెనాల్టీ

సీఅండ్‌డీ వ్యర్థాల సమస్య పరిష్కారమే లక్ష్యం

- చర్యలు చేపట్టిన జీహెచ్ఎంసీ యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో చెత్త (గార్బేజ్), నిర్మాణ, కూల్చివేతల (సీఅండ్‌డీ) వ్యర్థాల సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా పరిష్కారం కనిపించడం లేదు. వీటితో ఇతర సమస్యలు కూడా పెరుగుతున్నాయి. చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. సీఅండ్‌డీ వేస్ట్‌తో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిని నాలాలు, చెరువుల్లో ఎక్కువగా వేస్తున్నారు. నాలాల్లో వేస్తుండటంతో వర్షాలొచ్చినప్పుడు వాన నీరు పారే దారి లేక ముంపు సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి లేకుండా పోతోంది.

రీసైక్లింగ్ సదుపాయం ఉన్నా..

సీఅండ్‌డీ వ్యర్థాల పరిష్కారానికి నాలుగు ప్రాంతాల్లో (జీడిమెట్ల, ఫతుల్లాగూడ, శంషాబాద్, తూంకుంట) వీటి రీసైక్లింగ్ ప్లాంట్లున్నాయి. రియల్టర్లతో పాటు భవనాలు నిర్మించే వారు, కూల్చివేసే ఇతరులు నిర్ణీత చార్జీలు చెల్లిస్తే వీటిని తరలించే సదుపాయం ఉన్నప్పటికీ తరలించడం లేదు. వారి సొంత వాహనాల్లో తరలిస్తే కేవలం రీసైక్లింగ్ చార్జి మాత్రమే చెల్లించాలి. రవాణా చార్జీ మినహాయింపు ఉంటుంది. అయినా.. ఎక్కడ పడితే అక్కడే వేస్తున్నారు. దీంతో రీసైక్లింగ్ ప్లాంట్లు ఏర్పాటు చేసినవారికి ఆదాయం తగ్గడంతో పాటు నగర ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు.

తనిఖీలకు ఆదేశం

ఈ నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో ఈ వ్యర్థాలు కనిపించకుండా ఉండేందుకు టౌన్‌ప్లానింగ్ అధికారులు తనిఖీలు చేయాల్సిందిగా కమిషనర్ ఇలంబర్తి ఆదేశించారు. వీటిని వేస్తున్నవారిని గుర్తించి, పెనాల్టీలు విధించడంతో పాటు వారు మరోసారి వేయకుండా తగిన అవగాహన కల్పించాలని ఆదేశించారు. వారితో పాటు రీసైక్లింగ్ ప్లాంట్ల నిర్వాహకులు కూడా అధికారులతో కలిసి అవగాహన కల్పించాలని సూచించారు. ఇటీవలే ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

- గత నెల నవంబర్ 27 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు తరలించిన సీఅండ్‌డీ వ్యర్థాలు, విధించిన పెనాల్టీల వివరాలిలా ఉన్నాయి.
- మొత్తం 2022 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ ప్లాంట్లకు తరలించారు. ఇందులో ఎక్కువగా శేరిలింగంపల్లి సర్కిల్‌నుంచే 1467 మెట్రిక్‌టన్నుల వ్యర్థాలు తరలించారు. ఆ తర్వాత అధికంగా తరలించిన సర్కిళ్లలో ఉప్పల్ సర్కిల్‌నుంచి 208 మెట్రిక్ టన్నులు, సికింద్రాబాద్ సర్కిల్‌నుంచి 128 మెట్రిక్‌టన్నులు తరలించారు.
- మొత్తం 30 సర్కిళ్లకుగాను కేవలం 11 సర్కిళ్ల నుంచి వ్యర్థాలు మాత్రమే తరలించారు. 19 సర్కిళ్ల నుంచి తరలించలేదు. వాటిల్లో కొందరు ఫిల్లింగ్ వంటి అవసరాలకు వినియోగిస్తామని హామీ ఇచ్చారని అధికారులు తెలిపారు.
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తనిఖీల్లో 40 ప్రాంతాల్లో సీఅండ్‌డీ వ్యర్థాల్ని గుర్తించారు. 26 ప్రాంతాల్లో వాటిని వేసిన వారి నుంచి పెనాల్టీలు వసూలు చేశారు.అలా పెనాల్టీల ద్వారా రూ.1,54,000 వసూలు చేశారు.

పెనాల్టీల వివరాలు సర్కిళ్ల వారీగా..

సర్కిల్	పెనాల్టీ (రూ.లలో)
చార్మినార్	11,000
మెహిదీపట్నం	3,000
గోషామహల్	3,000
ఖైరతాబాద్	11,000
జూబ్లీహిల్స్	6,000
కూకట్‌పల్లి	15,000
కుత్బుల్లాపూర్	35,000
గాజులరామారం	15,000
అల్వాల్	3,000
సికింద్రాబాద్	17,000
బేగంపేట్	35,000



ఫ్యూచర్ సిటీకి ప్రత్యేక 'అథారిటీ'

అభివృద్ధి సంస్థ ఏర్పాటుకు సర్కారు కసరత్తు



- మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, పోలీసు విభాగాలతో సమన్వయం
- ఫోర్త్ సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు
- నిధుల వినియోగం, ప్లానింగ్, భూ కేటాయింపులు, నిర్వహణ బాధ్యత దీనిదే..

సాక్షి, సిటీబ్యూరో: భాగ్య నగరానికి భవిష్యత్ నగరం (ఫ్యూచర్ సిటీ) మణిహారంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా బేగరికంచె, మీర్‌ఖాన్‌పేటలలో సుమారు 50 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ, భద్రత తదితరాల నిర్వహణ కోసం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించారు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్), గ్రేటర్ నోయిడా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాధికార సంస్థ కార్యాచరణ, విధి విధానాలు ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ ప్రత్యేక అథారిటీ అధీనంలో పని చేయడానికి రెవెన్యూ, పట్టణాభివృద్ధి తదితర విభాగాల సిబ్బందిని కేటాయించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది.

అవాంతరాలు ఎదురవకుండా..

ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే 13,973 ఎకరాల భూమిని సేకరించింది. సుమారు మరో 36 వేల ఎకరాలను ల్యాండ్ పూలింగ్ ద్వారా సమీకరించనుంది. ఈ సిటీలో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది. ఇప్పటికే బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ, హెల్త్‌సైన్స్ పేరుతో 5 వేల ఎకరాల్లో గ్రీన్ ఫార్మాసిటీకి సీఎం శంకుస్థాపన చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సిటీ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ తరహాలో 70 ఎకరాల్లో అత్యాధునిక వాణిజ్య భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మలక్‌పేటలో 150 ఎకరాల్లోని హైదరాబాద్ రేస్ క్లబ్‌ను కూడా ఇక్కడకు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఫోర్త్ సిటీలో బీసీసీఐ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ఎలాంటి అవాంతరాలు ఎదురవకుండా, అనుకున్న సమయానికి పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా అథారిటీని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించారు.

లక్ష్యం ఇలా..

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, జలమండలి, విద్యుత్, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, రోడ్లు రవాణా శాఖ, పబ్లిక్ ఏజెన్సీలతో అభివృద్ధి కార్యకలాపాలను ఎఫ్‌సీడీఏ సమన్వయం చేస్తుంది. ఫోర్త్ సిటీ అభివృద్ధి సంస్థకు ప్రత్యేకంగా కేటాయించిన నిధుల వినియోగం, ఆర్థిక నియంత్రణను పర్యవేక్షిస్తుంది. భవిష్యత్ నగరికి ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు దేశ, విదేశీ సంస్థలు, పెట్టుబడులు తీసుకురావాలని సీఎం భావిస్తున్నారు. పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక పాలసీలు, ప్రోత్సాహకాల రూపకల్పన, అమలు అథారిటీదే బాధ్యత. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్‌తో నిర్వాసితులైన వారికి పునరావాసం కల్పన, పరిహారం అందజేత వంటి ప్రత్యామ్నాయ మార్గాలను సూచించడంతో పాటు పేద, మధ్యతరగతి వారికి సైతం ఫ్యూచర్ సిటీలో స్థానం కల్పించేలా అథారిటీ పని చేయనుంది. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలను రూపొందించడం, టౌన్‌షిప్‌లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, భూ కేటాయింపులు తదితరాలను పర్యవేక్షిస్తుంది.

మరణంలోనూ వీడని స్నేహ బంధం

అయిదుగురు నగర యువకుల జల సమాధి

- వీరందరూ చిన్ననాటి మిత్రులే.. • ఎల్‌బీనగర్‌లో విషాద ఛాయలు

విలపిస్తున్న హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు





వంశీ గౌడ్ ఇంటి వద్ద..

నాగోలు: వారంతా చిన్ననాటి మిత్రులు. మరణంలోనూ వారి స్నేహబంధం విడిపోలేదు. యాదాద్రి– భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లిన దుర్ఘటనలో నగరానికి చెందిన అయిదుగురు యువకులు జల సమాధి కావడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. మృతుల కుటుంబాల్లో తీరని దుఃఖమే మిగిలింది. వివరాలు ఇలా ఉన్నాయి.

ఎక్కడికెళ్లినా అందరూ కలిసే..

నగర శివారు బోడుప్పల్ జ్యోతినగర్‌లో ఉంటున్న మణికంఠ అనే యువకుడు ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. ఇతని స్నేహితుడు ఎల్‌బీనగర్ సిరినగర్ కాలనీ చెందిన తీగళ్ల వంశీ గౌడ్ (23) ఫొటోగ్రాఫర్. ఎల్‌బీనగర్ మజీద్ గల్లీకి చెందిన వీరమల్ల విఘ్నేష్ గౌడ్ (21) ఇంటర్ పూర్తి చేశాడు. ఎల్‌బీనగర్‌కు చెందిన హర్షవర్ధన్ (21) డిగ్రీ చదువుతూ రాపిడో డ్రైవర్‌గా పని చేస్తుండగా.. ఇదే ప్రాంతానికి చెందిన కలకోటి అక్షయ్ కుమార్ (19) ఇంటర్ చదువుకున్నాడు. ఎల్‌బీ నగర్ సిరినగర్ కాలనీలో ఉంటున్న జెల్లా వినయ్ (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వీరంతా చిన్ననాటి స్నేహితులు. ఎల్‌బీనగర్ పరిసర ప్రాంతాల్లో వీరు తరచూ కలుసుకుంటూ ఉంటారు. ఎక్కడికైనా అందరూ కలిసే వెళ్తుంటారు.

మణికంఠ ఒక్కడే బతికాడు..

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఎల్‌బీనగర్‌లో స్నేహితులందరూ కలుసుకున్నారు. అప్పటికే వంశీ గౌడ్ దగ్గర తన స్నేహితుడి కారు మారుతి స్విఫ్ట్ కారు ఉంది. ఆరుగురు స్నేహితులు కలిసి సరదాగా వెళ్లొద్దామని కారులో నగరంలో తిరుగుతూ యాదాద్రి– భువనగిరి జిల్లా కొత్తగూడెం నుంచి భూదాన్ పోచంపల్లికి తెల్లవారుజామున చేరుకున్నారు. అక్కడ టిఫిన్ దొరక్కపోవడంతో కొత్తగూడేనికి వచ్చారు. అక్కడ కూడా టిఫిన్ దొరక్కపోవడంతో కొద్ది సమయం అక్కడే ఉన్నారు. అక్కడి నుంచి వలిగొండలో తాటికల్లు కోసం కారులో బయలుదేరారు. అప్పుడు కారును వంశీ గౌడ్ నడుపుతున్నాడు. కారు మితిమీరిన వేగంతో వెళుతూ అదుపు తప్పి జలాల్‌పూర్ చెరువులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ఆరుగురిలో మణికంఠ ఒక్కడు మాత్రమే డోర్ ఓపెన్ చేసుకొని బయటపడ్డాడు. మిగతా అయిదుగురూ చెరువులోనే జల సమాధి అయ్యారు.

అంతులేని ఆవేదన..

ఎల్‌బీనగర్ పరిసర కాలనీల్లో నివాసం ఉండే అయిదుగురు స్నేహితులు ఒకేసారి చనిపోవడంతో ఆయా కుటుంబాల్లో అంతులేని ఆవేదన నెలకొంది. యువకుల కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలతో ఆయా కాలనీల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎదిగి వచ్చిన యువకులు తమ కుటుంబాలకు అండగా ఉంటారని అనుకుంటే.. వారంతా జల సమాధి కావడం అంతులేని విషాదాన్ని నింపింది.

పక్కనే ఉన్నా.. ఇంటికి వస్తున్నా అమ్మా..

ఎల్‌బీనగర్‌లో నివాసం ఉండే హర్షవర్ధన్ ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తూ తల్లికి అండగా ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ర్యాపిడోకు వెళ్తున్నానంటూ బయటకు వెళ్లిన హర్షవర్ధన్ తెల్లవారుజామున 2 గంటలకు తల్లికి ర్యాపిడోలో వచ్చిన 500 ఫోన్ పే చేశాడు. తల్లి మధురవాణికి ఫోన్ చేసి పక్కనే ఉన్నానమ్మా.. ఇంటికి వస్తున్నా అని చెప్పి స్నేహితులతో కలిసి కారులో భూదాన్‌పోచంపల్లికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ తల్లి శోకసంద్రంలో మునిగిపోయింది.

సినిమాకు వెళ్లొస్తానని..

పుష్ప సినిమాకు వెళ్తున్నా అంటూ వినయ్ తండ్రి వెంకటేష్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఆయన కుమారుడికి శుక్రవారం రూ.350 ఫోన్ పే చేశారు. రాత్రి కుటుంబ సభ్యులు వినయ్‌కి ఫోన్ చేయగా.. స్విచ్ ఆఫ్ రావడంతో స్నేహితుల వద్ద ఉన్నాడనుకున్నారు. ఉదయం కాలేజీ నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ రావడంతో విషయం తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

అతివేగానికి ఇద్దరు యువకులు బలి

- పేట్‌బషీరాబాద్‌లో రోడ్డు ప్రమాదం
- విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ద్విచక్ర వాహనం



కార్తీక్‌రెడ్డి (ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇటీవల కొత్తగా బైక్ కొన్న ఓ యువకుడు.. దానిపై మరో స్నేహితుడిని తీసుకుని వెళ్లి.. మిత్రులను కలిసి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురూ అసువులు బాశారు. ఈ దుర్ఘటన శనివారం తెల్లవారుజామున పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. గుండ్లపోచంపల్లికి చెందిన దొంతిరి కార్తీక్‌రెడ్డి (26) అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగి. ఇతను ఈ మధ్య రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను కొన్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు ఆరుద్ర అనిల్ (21)తో కలిసి సెంట్రల్ పార్క్‌లో ఉన్న మిత్రులు రాకేష్, నరేష్ వద్దకు శుక్రవారం రాత్రి వెళ్లారు. శనివారం వేకువజామున సుమారు 2 గంటల ప్రాంతంలో గుండ్లపోచంపల్లికి తిరుగు పయనమయ్యారు. వీరు వస్తున్న బైక్.. కృష్ణ ట్రేడర్స్ ఏజీ ల్యాండ్ సమీపంలోకి రాగానే అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో కార్తీక్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అనిల్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి అతివేగమే కారణమని పోలీసులు చెబుతున్నారు.

ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో..

అంతకుముందు బైక్‌పై వెళ్లిన ఇద్దరు స్నేహితులు ఇంటికి సక్రమంగా వెళ్లారా.. లేదా..? అని తెలుసుకునేందుకు స్నేహితుడు నరేష్ వీరికి ఫోన్ చేయగా ఎంతకు లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చిన నరేష్.. కార్తీక్‌రెడ్డి, అనిల్ కోసం వెళ్తుండగా రోడ్డుపై ఇద్దరు యువకులు పడి ఉన్న విషయాన్ని గుర్తించాడు. కార్తీక్‌రెడ్డి విగతజీవిగా పడి ఉండటం.. అనిల్ తీవ్ర గాయాలతో ఉండటాన్ని గమనించి కార్తీక్‌రెడ్డి తండ్రి నరసింహారెడ్డికి ఫోన్ చేసి పరిస్థితిని వివరించాడు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందడంతో రెండు కుటుంబాల్లో విషాదం అలముకుంది. మృతుల తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.





విల్లామేరీలో ఉల్లాసంగా..

సోమాజిగూడలోని విల్లామేరీ మహిళా డిగ్రీ కళాశాల స్నాతకోత్సవం శనివారం ఇక్కడ ఉత్సాహంగా సాగింది. 2021– 2024లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న 500 మంది విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ హాజరై ప్రసంగించారు. – పంజగుట్ట

సినీ ఫక్కీలో గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్టు



సీజ్ చేసిన గంజాయి, వివరాలు వెల్లడిస్తున్న పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు

శామీర్‌పేట్: సినీ ఫక్కీలో కారులో గంజాయిని తరలిస్తుండగా శామీర్‌పేట్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలింపు సాఫీగా సాగేందుకు ఆ ముఠా ఓ అద్దె కుటుంబాన్ని (భార్య, భర్త, ఇద్దరు మైనర్ బాలిక, బాలుడు) క్రియేట్ చేసి, వారు ప్రయాణిస్తున్న కారు సీట్ల కింద గంజాయిని పెట్టి రాష్ట్రానికి తీసుకువస్తుండగా మేడ్చల్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలను శనివారం పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు వెల్లడించారు. ఒడిశాకు గంజాయి సరఫరాదారుడు నయన్ దాస్‌తో పాటు గీత మండల్, గీత, హైదరాబాద్ ధూల్‌పేట్‌కు చెందిన అనికేష్ సింగ్, రోహిత్, రాజ్ సింగ్‌లు ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి కారు సీట్ల కింద పెట్టి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఫ్యామిలీతో వెళ్తే పోలీసులకు అనుమానం రాదని వీరంతా ఒకే కారులో ప్రయాణించారు. దీనిపై విశ్వసనీయ సమాచారంతో గురువారం రాత్రి శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టి గంజాయితో పాటు ఏడుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో 14 ప్యాకెట్లలో 26 కిలోల గంజాయి, కారు, రెండు ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.15.50 లక్షలుగా ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. మైనర్ బాలిక, బాలుడిని హోమ్‌కు తరలించారు.

ఓలలాడించిన జాజ్ సంగీతోత్సవం



కళాకారుల సంగీత ప్రదర్శన.. కార్యక్రమంలో మాట్లాడుతున్న జెన్నిఫర్ లార్సన్

సనత్‌నగర్: యూఎస్ కాన్సులేట్ ఆధ్వర్యంలో బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ జాజ్ సంగీతోత్సవం ఓలలాడించింది. అమెరికా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన జాజ్ సంగీత కళాకారులు డబుల్ బాస్, డ్రమ్స్, గిటార్, పియానో, శాక్సోఫోన్, బాకా, ట్రోంబోస్ తదితర సంగీత వాయిద్య పరికరాల వినియోగంతో శ్రోతలను అలరించారు. సంప్రదాయ బద్ధమైన జాజ్ సంగీతానికి నృత్యాన్ని జోడించడం ప్రధాన హైలెట్‌గా నిలిచింది. సంగీతోత్సంలో మల్‌స్ట్రోమ్, జార్స్‌హంల్ కలెక్టివ్, నేటివ్ జాజ్ క్యార్టెట్, చాచ ముందినో తదితర బ్రాండ్‌లను వినియోగించారు. కార్యక్రమానికి హాజరైన హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా జాజ్ సంగీతోత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సంగీతోత్సవానికి నగరం నలుమూలల నుంచి సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పదేళ్లలో చేయని అభివృద్ధిని ఏడాదిలోనే చేశాం

మంత్రి పొన్నం ప్రభాకర్



సంక్షేమ పథకాల ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

చార్మినార్: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధిని తమ ప్రభుత్వం ఏడాదిలోనే చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలో ఏడాదికాలంగా కులమతాలకతీతంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఇక ముందు కూడా సంక్షేమ పథకాల అమలు కోసమే తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. శనివారం ఉదయం చరిత్రాత్మక చార్మినార్ కట్టడం వద్ద ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికి చిహ్నంగా..విజయోత్సవాలు ప్రారంభిస్తూ మువ్వన్నెల బెలూన్లను మంత్రి ఆకాశంలోకి వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆరు గ్యారంటీల అమలు కచ్చితంగా జరుగుతుందన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి పథకాలను అమలు చేయలేదన్నారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలకు సవాల్ విసురుతున్నానన్నారు. తాము చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ విషయంలో ప్రతిపక్షాలకు ఎలాంటి అనుమానం ఉన్నా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. ఎమ్మెల్సీ ఆమేర్ అలీఖాన్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం రూ.3,003 కోట్ల నిధులను కేటాయించిందన్నారు. అంతేకాకుండా పాతబస్తీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. చార్మినార్ కట్టడానికి ఉన్న నాలుగు మినార్లు హిందు, ముస్లిం, సిఖ్, క్రిస్టియన్ మతాల మత సామరస్యానికి చిహ్నాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, టీపీసీసీ కార్యదర్శి ముజీబ్ ఉల్లా షరీఫ్, బహదూర్ పుర ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, నాయకులు కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అసత్య ప్రచారం చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాంరెడ్డి

లింగోజిగూడ: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై సామాజిక మధ్యమాలలో అసత్య ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ గుజరాత్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో రాహుల్ గాంధీని అవమానించే విధంగా మార్ఫింగ్ ఫోటోలు పెట్టి అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ పోస్ట్‌ల ద్వారా కాంగ్రెస్ పార్టీతో పాటు రాహుల్ గాంధీ వ్యక్తిత్వాన్ని కించపరిచారన్నారు. గుజరాత్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రకాంత్ రఘునాథ్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ అవమానాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ నాయకుల పోస్టులపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ నాగరాజ్ గౌడ్ తెలిపారు.

లెక్కలు సరిగా చేయడం లేదని గోడకుర్చీ

టెన్త్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

గచ్చిబౌలి: లెక్కలు సరిగ్గా చేయడం లేదనే కారణంతో టీచర్ గోడ కుర్చీ వేయించడం, అందరి ముందు తిట్టడంతో మనస్తాపానికి గురైన ఓ 10వ తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రాయదుర్గం డీఐ సతీష్ కుమార్ తెలిపిన ప్రకారం..రాయదుర్గంలోని నాగార్జున హైస్కూల్‌లో ఓ విద్యార్థి 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 4న మ్యాథ్స్ టీచర్ అబ్దుల్ నయీమ్ లెక్కలు సరిగ్గా చేయడం లేదని ఆ బాలుడిని గోడ కుర్చీ వేయించారు. అంతటితో ఆగకుండా అందరి ముందు తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంటికి వెళ్లిన తరువాత ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన తల్లి ఇరుగు పొరుగు వారి సహాయంతో కిందికి దించి స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని చెప్పారు. స్కూల్‌లో జరిగిన అవమానం వల్లే తన కుమారుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తల్లి శోభ శుక్రవారం సాయంత్రం రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫీ వీడియో తీసుకుని.. వ్యక్తి ఆత్మహత్య

బీఆర్ఎస్ నేతలు వేధించడం వల్లేనని ఆరోపణ



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

రహమత్‌నగర్: 'బీఆర్ఎస్ నాయకుల ఒత్తిడి వల్లే నేను చనిపోతున్నా..నా కుటుంబానికి న్యాయం చేయండి సార్లూ' అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని, సూసైడ్ నోట్ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండ డివిజన్ సాయాబాబానగర్‌లో నివాసముండే శ్రీనివాస్ ఎగౌడ్(48) సన్‌సిటీలోని ఓ హోటల్‌లో పని చేస్తుండేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇతని భార్య భాగ్యలక్ష్మికి, తోడి కోడలుకు మధ్య వారసత్వంగా వచ్చిన ఆస్తి విషయంలో తగాదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే అనుచరులైన బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్, డి.రాజు, సాయిచరణ్‌లు వీరి తగాదాలో తలదూర్చారు. సమస్య పరిష్కరిస్తామని చెప్పి ఓ స్థలానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తీసుకున్నారు. ఈ స్థలానికి సంబంధించిన సొమ్ము విషయంలో శ్రీనివాస్‌గౌడ్‌పై ఒత్తిడి చేశారు. దీంతో ఆయన శనివారం ఉదయం సూసైడ్ నోట్ రాసి, సెల్ఫీ వీడియో తీసి ఉరి వేసుకుని తనువు చాలించాడు. తనకు బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అన్యాయం చేశారని, వారిని కఠినంగా శిక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి, నగర పోలీస్ కమిషనర్‌ను సూసైడ్ లేఖలో కోరారు. మృతుని కుమారుడు దుర్గేష్ ఫిర్యాదు మేరకు కేసు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్, రాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మరో వ్యక్తి సాయిచరణ్ పరారీలో ఉన్నట్లు ఎస్‌హెచ్ఓ వీరశేఖర్ తెలిపారు. కాగా ఈ ఘటనపై బోరబండ, రహమత్‌నగర్ కార్పొరేటర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. దోషులను కఠినంగా శిక్షించాలని బోరబండ ఎస్‌హెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు.

సైబర్ బాధితులకు రూ.35 లక్షలు రీఫండ్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ విభాగం రెండు సైబర్ క్రైమ్ కేసులలో రూ.35 లక్షలు సొమ్మును బాధితులకు రీఫండ్ చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 28 ఏళ్ల గృహిణి, 76 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి ఇద్దరు బాధితులకు సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేసి మనీలాండరింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడ్డారని, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయభ్రాంతులకు గురి చేశారు. కేసులు, అరెస్ట్‌లు లేకుండా ఉండాలంటే అడిగినంత సొమ్ము బదిలీ చేయాలని సూచించడంతో ఇద్దరు బాధితులు కేటుగాళ్లు సూచించిన బ్యాంక్ ఖాతాలకు రూ.85 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈమేరకు నమోదైన కేసులో విచారణాధికారులు వేగంగా స్పందించి, ఖాతాలోని సొమ్మును ఫ్రీజ్ చేయాలని కోరుతూ బ్యాంక్‌కు నోటీసులు పంపించారు. అనంతరం ఖాతాలోని సొమ్ము రీఫండ్ చేయాలని బాధితులు కోర్టులో పిటిషన్ వేయడంతో పోలీసులు రూ.35 లక్షల నగదును రీఫండ్ చేశారు. చాకచక్యంగా స్పందించి బాధితులకు న్యాయం చేసిన సైబర్ క్రైమ్ విభాగం పోలీసులను కమిషనర్ సీవీ ఆనంద్ అభినందించారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

సీపీఐ ఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య



మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

పంజగుట్ట: కాంగ్రెస్ ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అయిన ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామనే డిమాండ్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఎన్‌కౌంటర్స్ చేయడం బాధాకరమని సీపీఐ ఎం.ఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ రాష్ట్ర కమిటీ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారం చేజిక్కించుకుని దేశంలో పాసిస్ట్ పాలన కొనసాగిస్తోందని భారత రాజ్యాంగాన్ని మనువాద రాజ్యాంగంగా మార్చేందుకు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కానీ మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల విద్యుత్ తప్ప ఏ హామీ నెరవేర్చడం లేదని అన్నారు. రేవంత్ ప్రభుత్వం వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మతతత్వ శక్తుల ప్రమాదం పెరిగిందని, బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు అనేక కుట్రలు జరుగుతున్నాయని, దీన్ని నిలువరించేందుకు కమ్యూనిస్టులంతా ఐక్యంగా పోరాడాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ ఎం.ఎల్ లిబరేషన్ పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు, తెలంగాణ ఇన్‌చార్జి నైనాలశెట్టి మూర్తి, కార్యదర్శి మామిండ్ల రమేష్ పాల్గొన్నారు.

10న ఎస్సీ వర్గీకరణపై విచారణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ వర్గీకరణపై ఈ నెల 10న ఏకసభ్య కమిషన్ విచారణకు హాజరుకాబోతోందని కలెక్టర్ నారాయణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మేడ్చల్, వికారాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలో విచారణకు రంగారెడ్డి కలెక్టరేట్‌లో హాజరుకావాలని సూచించారు. ఎస్సీ కులాల సంఘం నాయకులు అధిక సంఖ్యలో రావాలన్నారు. ఏకసభ్య కమిషన్ సభ్యుడు డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్బర్ హాజరుకానున్నట్లు తెలిపారు.

